క్లుప్తంగా

ఆరెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆరెమ్మ దేవత

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని సిద్దారెడ్డిపల్లి క్రాస్‌లో వెలసిన ఆరెమ్మతల్లి కుల దేవతకు నాయీబ్రాహ్మణులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 60 కుటుంబాల నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో పూజారి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నియామకం



ఉదయ్‌కుమార్

పీలేరు : అన్నమయ్య జిల్లా గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం యువజన కన్వీనర్‌గా పీలేరుకు చెందిన టి.ఉదయ్‌కుమార్ నియమితులయ్యారు. ఆదివారం నెల్లూరులో జరిగిన సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో జిల్లా యువజన కన్వీనర్‌గా ఉదయ్‌కుమార్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండపల్లె వెంకటరమణ, ఎం.వి.రమణలకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారుడికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న రాఘవరెడ్డి

మదనపల్లె సిటీ : జూనియర్ షూటింగ్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు పి.జయంత్‌కుమార్‌కు పారిశ్రామికవేత్త మలిగి మధుసూధన్‌రెడ్డి ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. స్థానిక శ్రీనివాస డిగ్రీ కాలేజీలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న జయంత్‌కుమార్ ఈ నెల 27 నుంచి పశ్చిమబెంగాల్‌లోని హౌరాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అయితే ఆర్థిక పరిస్థితి బాగ లేక పోవడంతో పోటీలకు వెళ్లేందుకు కష్టంగా మారింది. ఆదివారం క్రీడాకారుడికి మధుసూధన్‌రెడ్డి సోదరుడు రాఘవరెడ్డి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే తన సహాయ, సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పీడీ రామ ఉన్నారు.

ఆర్థిక సాయం



రామకృష్ణకు ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ ఈశ్వరయ్య

మదనపల్లె : అనారోగ్యంతో బాధపడుతూ, శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామకృష్ణకు పోతబోలు సర్పంచ్ ఈశ్వరయ్య తనవంతుగా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పోతబోలు దళితవాడలోని రామకృష్ణ ఇంటికి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. హార్ట్ సర్జరీకి అధికంగా ఖర్చు కావడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు రామకృష్ణ తెలిపారు. తన పరిస్థితిపై వైఎస్సార్‌సీపీ వాట్సప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టి తనను ఆదుకునేందుకు నాయకులు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. తన పరిస్థితి తెలుసుకుని ఇంటికి వచ్చి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించడంపై సర్పంచ్ ఈశ్వరయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రత్నమయ్య, నాగరాజ, ఖాజా, సుధాకర, లక్ష్మీపతి, శీన, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి..

బి.కొత్తకోట : ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న భవన నిర్మాణ కార్మికుడు ఈశ్వరప్పకు రూ.30 వేల ఆర్థిక సాయాన్ని ఆ కార్మిక సంఘ నాయకులు సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం అందజేశారు. పీటీఎంకు చెందిన ఈశ్వరప్పను ఆదుకునేందుకు ఆయన కుటుంబానికి సంఘం తరఫున అందించినట్టు వారు తెలిపారు.

నూతన కార్యవర్గం



విద్యుత్‌కార్మిక సంఘం నూతన కమిటీ

పీలేరు రూరల్ : విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుగుణాకర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్వీఎస్ఎస్ కల్యాణ మండపంలో పీలేరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గురుశంకర్, కార్యదర్శిగా రెడ్డెప్ప, కార్యనిర్వాహక అధ్యక్షులుగా వి.శ్రీనివాసులు, అదనపు అధ్యక్షులుగా ఆరీఫుల్లా, అదనపు కార్యదర్శిగా టి. రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రెడ్డిబాషా, కోశాధికారిగా యం.వి. గంగాధర్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఘనంగా సన్మానించారు.

సేవే మార్గం

- చిరస్మరణీయుడు జాకబ్ చాంబర్లీన్
- విద్య, వైద్య, సామాజిక సేవలు



జాకబ్‌చాంబర్లీన్

మదనపల్లె సిటీ : క్రైస్తవ మిషనరీలు ఆధ్యాత్మిక, విద్య, వైద్య రంగాల్లో ఎనలేని సేవలు అందిస్తున్నాయి. మదనపల్లె పట్టణంలో సుదీర్ఘ కాలంగా సేవలు అందిస్తుండటం విశేషం. ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతున్నాయి.

ఆద్యుడు జాకబ్ చాంబర్లీన్

అమెరికా దేశస్తుడు డాక్టర్ జాకబ్ చాంబర్లీన్ అమెరికన్ ఆర్కాట్ మిషనరీ ఆధ్వర్యంలో 1860లో మదనపల్లెకు వచ్చారు. క్రైస్తవమత వ్యాప్తిలో భాగంగా గాంధీరోడ్డులో 1861లో మిషన్‌కాంపౌండ్ నిర్మించారు. జిల్లా ఆస్పత్రి స్థలంలో 1863లో చిన్నవైద్యశాల ఏర్పాటు చేశారు. ఎంతో మంది నిరుపేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించారు. 1865లో తొలి క్రైస్తవ సంఘాన్ని ఏర్పాటు చేశారు.

జ్ఞానోదయ క్షేత్రం ఏర్పాటు

స్థానిక మిషన్ కాంపౌండ్‌లో జ్ఞానోదయ క్షేత్రం ఏర్పాటు చేశారు. ఇక్కడే మొట్టమొదట సువార్త కూటములు ఏర్పాటు చేశారు. ఎంతో మంది ఇక్కడికి వచ్చి కూటములు నిర్వహించారు. కూటములతో ఎంతో మందికి జ్ఞానోదయం కలిగింది. దీంతో దీనిని జ్ఞానోదయ క్షేత్రంగా పిలుస్తున్నారు. ఈ క్షేత్రాన్ని ప్రస్తుతం పార్కుగా ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దారు.

113 ఏళ్లుగా వైద్య సేవలు

స్థానిక చిత్తూరురోడ్డులో ఎంఎల్ఎల్ ఆస్పత్రి (గోషా) ఆస్పత్రిని 1911లో ప్రారంభించారు. మిషనరీల ఆధ్వర్యంలో ఆస్పత్రి నడుస్తోంది. అప్పట్లో ఆస్పత్రిలో అమెరికా నుంచి పలువురు తెల్లదొరలు వచ్చి వైద్యసేవలు అందించారు. ఇక్కడే నివాసముండి వైద్య సేవలు అందించారు. మదనపల్లె కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు ఎంతో మంది ఆస్పత్రికి వచ్చి చికిత్సలు చేయించుకుంటున్నారు. ప్రస్తుతం ఆస్పత్రి రాయలసీమ మిషనరీ ఆధ్వర్యంలో నడుస్తోంది.

144 ఏళ్లుగా విద్యారంగానికి సేవలు

మదనపల్లె పరిసర ప్రాంతాల ప్రజలకు ఉచితంగా విద్యను అందించాలన్న ఉద్దేశంతో జాకబ్‌చాంబర్లీన్ విద్య రంగానికి ఎనలేని సేవలు అందించారు. ఇందులో భాగంగా స్థానిక చిత్తూరు రోడ్డులో 1880లో సీఎస్ఐ బాలికల ఉన్నత పాఠశాల ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మందికి ఉచితంగా విద్యను అందిస్తోంది. స్థానిక అవెన్యూ రోడ్డులోని 1881లో హోప్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేశారు. రెండు పాఠశాలలు ఎంతో మందికి విద్యను అందిస్తున్నాయి.

లైబ్రరీ ఏర్పాటు

స్థానిక జేసీఎం చర్చి ఆవరణలో క్రైస్తవ మత ప్రచారం కోసం రీడింగ్ రూము ఏర్పాటు చేశారు. జాకబ్‌చాంబర్లీన్ ఆంగ్లసాహితివేత్త. దీంతో లైబ్రరీ ఏర్పాటుకు ఎంతో కృషి చేశారు. లైబ్రరీ ఉండటంతో ఈ ప్రాంతాన్ని ఇప్పటికీ రీడింగ్‌రూముగా పిలుస్తున్నారు. మదనపల్లెలో క్రైస్తవ మతవ్యాప్తి కోసం ఎంతో కష్టపడిన డాక్టర్ జాకబ్ చాంబర్లీన్ 1908లో మృతి చెందారు.



సీఎస్ఐ బాలికల ఉన్నత పాఠశాల



ఎంఎల్ఎల్ ఆస్పత్రి

అమోఘం



క్రైస్తవ మత వ్యాప్తితోపాటు విద్య, వైద్య రంగాల్లో జాకబ్ చాంబర్లీన్ సేవలు అమోఘం. ఆయన చూపిన బాటలో అందరూ నడవాలి. పాఠశాలలు ఏర్పాటు చేసి ఎంతో మందికి విద్యాజ్యోతులు వెలిగించారు. ఎంతో మందికి ఉచిత వైద్య సేవలు అందించారు.

- రెవ డాక్టర్ సునీల్‌వరకుమార్, డివిజన్ సంఘ కాపరి

రెడ్డెమ్మ తల్లీ.. చల్లగా చూడమ్మా..

గుర్రంకొండ : 'రెడ్డెమ్మ తల్లీ చల్లగా చూడమ్మా' అంటూ భక్తులు వేడుకొన్నారు. ఆదివారం చెర్లోపల్లె గ్రామంలోని శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేషమైన పూజలు, అభిషేకాలు చేశారు. సంతానం ప్రసాదించే తల్లిగా అమ్మవారు ప్రసిద్ధి పొందారు. ఆలయానికి సమీపంలోని దిగువ తొట్టివారిపల్లెలో అర్చకులు పంపిణీ చేసే ఆకు పసరును తాగిన మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించారు. తడిబట్టలతోనే అమ్మవారి ముందు సంతానం కోసం వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరె సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. ఆలయమెట్లకు పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటకతోపాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రావడం విశేషం.



ఆలయంలో సంతానం కోసం వరపడిన మహిళలు

నిమ్మనపల్లె అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం నిమ్మనపల్లె మండలంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా విస్తృతంగా పర్యటించారు. అడుసుపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కురవపల్లెలో నూతనంగా నిర్మించిన నల్లగంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బహుదా ప్రాజెక్ట్ వద్ద రూ.34 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే మండలంలోని పలు గ్రామాలకు సీసీరోడ్లు, మురుగుకాలువలు నిర్మించడం జరిగిందన్నారు. బహుదా ప్రాజెక్ట్ వద్ద పార్క్ ఏర్పాటుతో పాటుగా, అధికారులు ఉండేందుకు కార్యాలయం, ప్రాజెక్టుకు మరమ్మతులు, కాలువలు శుభ్రం చేయడం, జనరేటర్ ఏర్పాటుకు రూ.34 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ ప్రసాద్, ఏఈ శ్రీహరిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్‌చక్రవర్తి, నీటివినియోగదారుల సంఘం అధ్యక్షులు దేవేంద్రరెడ్డి, డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, సర్పంచ్ చంద్రాయుడు, శ్రీవాణి, మాజీ జెడ్పీటీసీ సుజాత, రాజన్న, మేష రామకృష్ణ, రమణ, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



బహుదా ప్రాజెక్ట్ వద్ద అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

బీటీ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

మదనపల్లె : రాయలసీమ విద్యాచరిత్రలో మకుటాయమానంగా నిలిచి, లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి, ఎందరో మేధావులు, రాజకీయ ఉద్దండులు, న్యాయమూర్తులకు ఉజ్వల భవిష్యత్‌ను ప్రసాదించిన బిసెంట్ థియోసాఫికల్ డిగ్రీ కళాశాల నేడు మూతపడే పరిస్థితికి వచ్చిందని బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీటీ కళాశాలలో కోర్సులు లేక, అడ్మిషన్లు సక్రమంగా జరగక మూతపడే పరిస్థితికి చేరుకోవడం బాధాకరమన్నారు. బీటీ కళాశాలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు, ప్రభుత్వపరం చేసేందుకు, కోట్ల విలువ చేసే కాలేజీ ఆస్తుల పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో.. బహుజన్ సమాజ్‌పార్టీతోపాటు కమ్యూనిస్టు పార్టీలు, విద్యార్థి సంఘాలు చాలారోజుల పాటు ఉద్యమాలు జరిపామన్నారు. దీంతో బీటీ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడమే కాకుండా యూనివర్సిటీగా ఏర్పాటు చేస్తూ జీఓ విడుదల చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్... మదనపల్లె యువగళం పాదయాత్రలో ప్రతిపక్షనాయకుడిగా మదనపల్లెను జిల్లా చేస్తామని, బీటీ కళాశాలను యూనివర్సిటీ చేస్తామని, టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి, తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తామని హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తి కావస్తున్నా.. ఇప్పటి వరకు ఒక్క హామీ నెరవేర్చకపోగా మదనపల్లెకు మంజూరైన ప్రభుత్వ మెడికల్ కాలేజీని నడపలేమంటూ చేతులెత్తేశారన్నారు. ఉద్దేశ పూర్వకంగానే కాలేజీని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు పావులు కదుపుతూ, నిర్మాణ పనులు జరగనీయకుండా నిలిపివేశారన్నారు. స్థానిక విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేయడమే కాకుండా, పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందకుండా అన్యాయం చేశారన్నారు. మెడికల్ కాలేజీని నిర్వీర్యం చేసినట్లుగానే, బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అడ్మిషన్లు లేవని, నడపలేమని చెప్పి ప్రైవేట్‌పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతుందేమోనన్న అనుమానం మదనపల్లె ప్రజలకు కలుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యామంత్రి నారాలోకేష్ ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం బీటీ కళాశాలకు యూనివర్సిటీ స్థాయిని కల్పిస్తూ, కొత్త కోర్సులు ప్రారంభించి, అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో బీఎస్పీతో పాటుగా బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్, విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమానికి పిలుపునిస్తామన్నారు. అనిబిసెంట్ ఏ ఆశయాల కోసం బీటీ కళాశాలను స్థాపించారో, వాటిని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సహదేవ, రమణ, శ్రీనాథ్, గంగాధర్, లక్ష్మీపతి, సంధ్య, శివ, ప్రశాంత్, మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్

మండల్ మీట్ జరిగేనా?

పెద్దతిప్పసముద్రం : రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 24న స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండల్ మీట్ జరుగునని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సమగ్రమైన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు. అయితే గతంలో ఒకసారి పూర్తి స్థాయిలో కోరం ఉన్నప్పటికీ అధికారులు పొంతన లేని కారణాలు చూపుతూ సభను వాయిదా వేశారు. అనంతరం రెండు సార్లు సమావేశం నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధం అయినా ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో పాటు సభ నిర్వహించరాదని కూటమి నాయకులు అడ్డుకోవడంతో మళ్లీ వాయిదా పడింది. ఈ తరుణంలో మండల్ మీట్ జరపాలని రాష్ట్ర ఉన్నత ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మండలంలో తీవ్రమౌతున్న ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు ఇటు సభ్యులకు, అటు అధికారులకు పూర్తి భద్రత కల్పిస్తూ ప్రశాంతంగా సభ నిర్వహిస్తారా.. లేకుంటే కూటమి నాయకుల రాజకీయ ఒత్తిళ్ల కారణాలతో అధికార యంత్రాంగం చేతులెత్తేస్తుందో మంగళవారం వరకు వేచి చూడాల్సిందే.

రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



రామానుజన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ : గణితశాస్త్ర పితామహుడు, గణిత బ్రహ్మ శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయులు ఘన నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా రామానుజన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక విద్యార్థి రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని గణితంలో రాణించాలని గణిత విభాగాధిపతి సుధాకర్‌నాయుడు, బావాజన్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27న విద్యుత్ చార్జీల బాదుడుపై పోరు

పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కలికిరి : సీఎం చంద్రబాబు నాయుడు మాటల గారడీ, అబద్ధాలు చెప్పడంలో దిట్ట అని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలలు తిరక్కుండానే విద్యుత్ చార్జీల మోత మోగించడంపై వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు ఈ నెల 27న 'కరెంటు చార్జీల బాదుడుపై పోరుబాట' కార్యక్రమం చేపట్టనున్న సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎట్టి పరిస్థితిల్లోనూ కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు, ఇప్పుడు దఫాలుగా కరెంటు చార్జీలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో బాబు ఇచ్చిన హామీని గుర్తు చేసుకుంటే.. జగన్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని, తాము అధికారంలోకి వస్తే పెంచబోమని చెబుతూ అవసరమైతే గతంలో పెంచిన చార్జీలు తగ్గిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారన్నారు. ఎండతో కరెంటు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఇంటి నుంచి ప్రభుత్వమే విద్యుత్ కొనుగోలు చేసేలా చేస్తానని ప్రగల్భాలు పలికారన్నారు. ఇలా నోటికి వచ్చినట్లు అపద్ధపు హామీలతో రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పార్టీలు ఊదరగొట్టాయన్నారు. ఎల్లో మీడియా విస్తృతంగా ప్రచారం చేసిందన్నారు. ప్రజలు నమ్మి ఓటు వేసిన తర్వాత మోసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సరిగ్గా ఆరు నెలలు గడవక మునుపే నవంబరులో రూ.6072.86 కోట్లు, డిసెంబరులో రూ.9412.50 కోట్లు మొత్తం రూ.15,485.36 కోట్లు ప్రజలపై భారం వేస్తూ చార్జీల మోత మోగించడం బాధాకరమన్నారు. ఇది ముమ్మాటికి ప్రజలను దారుణంగా మోసగించడమేనన్నారు. తప్పుడు హామీలు, అమలుకు అలివికాని హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజలకు చుక్కలు చూపుతున్నారని విమర్శించారు. ఓట్లేసిన ప్రజలను ముంచడంలో చంద్రబాబునాయుడు కొత్త కొత్త పద్ధతులు కనిపెడుతున్నారని ఎద్దేవా చేశారు. చార్జీల పెంపును ఉపసంహరించుకునే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 27న నియోజకవర్గ కేంద్రం పీలేరు విద్యుత్ శాఖ కార్యాలయం ముందు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో నిరసన చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

గాండ్ల కులస్తుల అభివృద్ధికి సహకారం అందించండి

మదనపల్లె : రాష్ట్రంలోని గాండ్ల, తెలికుల కులస్తుల అభివృద్ధికి సహకారం అందించేలా, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిందిగా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావుకు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బండపల్లె వెంకటరమణ, కార్యదర్శి ఎం.వి.రమణ వినతి చేశారు. ఆదివారం అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం నెల్లూరులో జరిగింది. కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా తరఫున అధ్యక్ష, కార్యదర్శులు బండపల్లె వెంకటరమణ, ఎం.వి.రమణ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు బద్రిప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావును ఘనంగా సన్మానించారు. గాండ్ల కులస్తులందరికీ సబ్సిడీ ధరలకు విద్యుత్ గానుగ మిషన్లు, నూనె వ్యాపారం చేసుకునేందుకు ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడికి నివేదించారు.



సుబ్బారావును సన్మానిస్తున్న నాయకులు

సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి కృషి

మదనపల్లె సిటీ : సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం విజయవాడలో సీనియర్ సిటిజన్స్ రజతోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పలు సమస్యలు రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. మదనపల్లెకు చెందిన సీనియర్ సిటిజన్స్ కనువిప్పు అనే షార్ట్‌ఫిల్మ్ తీసినట్లు తెలిపారు. మంచి సందేశాత్మక లఘుచిత్రంను అందరూ చూడాలని కోరారు. చిత్రం తీసిన దర్శకులు, నిర్మాతలను అభినందించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మిలను రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరావు అభినందించారు.



మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మిని సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి

మా ప్రభుత్వంలో మీ పార్టీ బ్యానర్ ఏమిటి?

- వైఎస్సార్‌సీపీ అభిమానులపై టీడీపీ నాయకుల దాడి
- బాధితులకు ఎంపీ మిథున్ ఫోన్‌లో పరామర్శ
- వైద్య సాయం అందజేత
- పార్టీ అండగా ఉంటుందని భరోసా

మదనపల్లె : 'అధికారంలో మా పార్టీ ఉంది. మా ప్రభుత్వంలో మీ పార్టీ బ్యానర్ కడితే చూస్తూ ఊరుకుంటామా'... అంటూ అన్నమయ్య జిల్లా మాలేపాడు పంచాయతీ ఆవులపల్లె నల్లరాజుగారిపల్లెలో వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడులకు తెగబడ్డారు. ఆడ, మగ, చిన్నపిల్లలు అనే తేడా లేకుండా విచక్షణారహితంగా అందరిపై దాడికి దిగారు. దీంతో వీరు తిరగబడితే, ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువైపులా పలువురికి గాయాలయ్యాయి. అయితే పోలీసులు ఏకపక్షంగా అధికార పార్టీకి చెందిన వారికే మద్దతు తెలుపుతూ, వైఎస్సార్ సీపీకి చెందిన 15 మందిపై కేసులు నమోదు చేశారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందిపై కేసులు కట్టారు. ఇంటి దగ్గర మూగజీవాల మేత లేకుండా అల్లాడుతున్నాయని, ఆడవాళ్లనైనా వదిలేయండని ప్రాధేయపడినా వినకుండా రెండు రోజులుగా స్టేషన్‌లోనే ఉంచేశారు. నల్లరాజుగారిపల్లె దాడి ఘటనపై తెలిసిన వెంటనే ఎంపీ మిథున్‌రెడ్డి మాలేపాడు సర్పంచ్ గణేష్‌కు ఫోన్ చేసి వాస్తవ పరిస్థితులు తెలుసుకున్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితురాలు సరోజమ్మను, దేశాయ్ హాస్పిటల్‌లో చేర్పించి తక్షణ వైద్య సేవలు అందించేలాగా చర్యలు తీసుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పాల్సిందిగా స్థానిక నాయకులను ఆదేశించి, తన తరఫున పీఏ దస్తగిరిని పంపి, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నల్లరాజుగారిపల్లె బ్యానర్ వివాదంపై బాధితురాలు సరోజమ్మ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం ఆవులపల్లె మెయిన్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవస్థానానికి పక్కలో రోడ్డుకు మధ్యలో గ్రామస్తులు ఫ్లెక్సీ బ్యానర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీన్ని కావాలనే రాజకీయం చేసేందుకు దురుద్దేశంతో టీడీపీ నాయకులు రమేష్, చక్రపాణి, వెంకటరమణ, గణేష్, సురేష్ తదితరులు వివాదం రేపి ఘర్షణ వాతావరణం నెలకొల్పారన్నారు. అభిమాన నాయకుడి జన్మదినానికి బ్యానర్ ఏర్పాటు చేశామని, రేపటి రోజు తర్వాత కావాల్సి వస్తే తీసేస్తామని, ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తే మీకు అభ్యంతరమేంటని చెపుతున్నా వినిపించుకోకుండా, అధికారంలో మేం ఉన్నాం. మీరు మాకేంది చెప్పేదంటూ దాడి చేశారన్నారు. దాడిలో తన ఎడమ చేయిని విరగ్గొట్టారని, బాణాల కృష్ణమూర్తిని తీవ్రంగా గాయపరిచారన్నారు. రాత్రి 12 గంటల సమయంలో గాయాలతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వెళితే... పరికరాలు లేవని తిరుపతికి వెళ్లిపోండంటూ రెఫర్ చేశారన్నారు. రాత్రి వేళల్లో వెళ్లలేమని, ప్రస్తుతానికి ఇక్కడే చికిత్సలు అందించండన్నా పట్టించుకోలేదన్నారు. టీడీపీ వాళ్లను మాత్రం చేర్చుకుని చికిత్సలు అందించారంది. తనకు ఇంటి వద్ద రెండు పాడిఆవులు, గొర్రెలు ఉన్నాయని, మూగజీవాలకు మేత వేసేందుకు ఇంటివద్ద ఎవరూ లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని వాపోయింది.

ఎంపీ మిథున్‌రెడ్డి తక్షణ స్పందన

నల్లరాజుగారిపల్లెలో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడి ఘటనపై సమాచారం తెలిసిన వెంటనే ఎంపీ మిథున్‌రెడ్డి స్థానిక నాయకులను అప్రమత్తం చేశారు. మాలేపాడు సర్పంచ్ గణేష్‌తో మాట్లాడారు. బాధితురాలు సరోజమ్మను స్థానికంగా ఉన్న దేశాయ్ హాస్పిటల్‌లో చేర్పించి వైద్యసేవలు అందించాల్సిందిగా ఆదేశించారు. అలాగే పోలీసు కేసులకు సంబంధించి న్యాయసహాయం అందించేందుకు ఆదివారం ఉదయం పీఏ దస్తగిరిని మదనపల్లెకు పంపి, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక నాయకులను బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పాలన్నారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, యువనాయకులు డి.హర్షవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ గణేష్ చికిత్స పొందుతున్న బాధితురాలు సరోజమ్మను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని, ఏ ఇబ్బంది వచ్చినా తాము చూసుకుంటామని భరోసా కల్పించారు.



బాధితురాలు సరోజమ్మను పరామర్శించి, ధైర్యం చెబుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



విరిగిన సరోజమ్మ ఎడమ చేయి (ఎక్స్‌రే చిత్రం)

పీవీ రావుకు ఘన నివాళి



పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

పీలేరు రూరల్ : మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు 19వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆ శాఖ నాయకులు నిర్వహించారు. ఆదివారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో అంబేడ్కర్, పీవీ రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి. ధరణికుమార్ మాట్లాడుతూ మాలల కోసం 25 ఏళ్ల క్రితం తన ఆత్మగౌరవ పోరాటం చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదులుకున్న పీవీ రావు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. వివిధ కోర్టు మెట్లు ఎక్కి ఎస్సీ వర్గీకరణ చెల్లదని 2004లో భారత అత్యున్నత న్యాయస్థానం ద్వారా స్పష్టమైన తీర్పు సాధించి అతిపెద్ద విజయాన్ని చేకూర్చారని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఢిల్లీకి వెళ్లి 2005 డిసెంబర్ 22న అక్కడే మృతి చెందిన పీవీ రావు త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్, మాలమహానాడు నాయకులు సుభాష్, మల్లికార్జున, భాను, ఆంజినేయులు, ఆనంద్, బాలగంగాధర్, రెడ్డయ్య, రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.